# ఇది కలిదిండి రాజుగారి కథ

**కర్రెంకయ్యగారి మేనల్లుడు రామరాజుగారు పాత చిన్న కారొకటి కొనుక్కొచ్చి ఊళ్ళోకి దిగుతున్నాడు.**

**సైకిలెనకాల నన్నెక్కించుకుని తొక్కుతున్న కర్రోరి సుబ్బుల్ని చూసి కారాపిన రామరాజు ''బండి రంగెలాగుంది సుబ్బులూ???'' అన్నాడు.**

**''పేడకసురు రంగు కదా చాలా బాగుంది'' అన్నాడు సుబ్బులు.**

''అద్దికి తిప్పాలిగాబట్టి రేపట్నుంచి రాంపురంలో చినరాజుగారి కోటముందు పెడతాను ఈ బండిని'' అన్నాడు రామరాజు.

''అంతా బానే వుందిగానీ ఈ బండికొన్న సందట్లో పార్టీ ఇవ్వవా?''అడిగేడు కర్రోరి సుబ్బులు.

''భలేవోడివే...ఎక్కడ జేసుకుందాం పార్టీ... కాకినాడెళ్ళిపోదామా?'' అడిగేడు రామరాజు.

''యానాం వెళదాం'' అని సుబ్బులనడం ఆరోజు మధ్యాన్నమే ప్రయాణమైపోతా పక్కనే నిలబడున్న నన్ను ''నువ్వూరావో'' అన్నారు.

రామరాజు చిన్నకారు రామచంద్రపురం, ద్రాక్షరామం, డొడ్డంపేట దాటి ఎర్రపోతవరం లాకులు దిగబోతుండగా పెద్ద సౌండు జేసి ఆగిపోయింది.

బండి స్టార్టు చెయ్యడానికి నానాతంటాలూ పడ్తున్నాడు డ్రైవరు బూరయ్య. వాడలా బండితో కుస్తీ పడ్తుంటే అక్కడే కూర్చున్న మాకందరికీ చాలా ఇసుగొచ్చింది. తలో పక్కకీ పోతుంటే నేను లాకుల లోపలికెళ్ళేను.

మహానుభావుడు కాటన్ దొరగారి కాలంనాడు కట్టిన ఆ లాకులూ ఆ ఇళ్ళు ఇప్పటికీ దిట్టంగా కుదుమట్టంగా వున్నాయి. ఎడాపెడా నీళ్ళతో నిండిపోయిన కాలవలు. ఒక కాలవకి పైరుంటే ఇంకో కాలవకి లాకులున్నాయి. వాటికెదురుగా లాకుల సూపర్నెంటూ, లస్కర్లూ, గంటాగళాసూ ఉండే క్వార్టర్సున్నాయి. రెండు కాలవలకీ మధ్య త్రిభుజాకారంలో ఉంది మొండి. దాంట్లోకెళ్ళేను. రకరకాల చెట్లూ పొదల్తో ఆ మొండి లోపల ఎక్కడ చూసినా పచ్చ పచ్చగానే ఉంది.

ఒక పెద్ద చెట్టుకింద కూర్చున్నాడో మనిషి, కళ్ళప్పగించి అలా చూస్తుండిపోయేను ఆయన్ని. పొడుగాటి తెల్లగడ్డం, జుట్టూ, పాలిపోయిన



గులాబీ పువ్వు రంగు శరీరంతో పొడుగ్గా ఉన్నాడాయన. ఆ పక్కనించి వెళ్తున్న లాకుల సూపర్నెంటూ, లస్కరూ దణ్ణాలు పెడ్తుంటే వాళ్ళకేసి తలెత్తికూడా చూడ్డం లేదా ముసలాయన.

ముంత పట్టుకొచ్చిన ఇంకో ముసిలోడు ఆ ముసలాయన ముందుకొచ్చి కూర్చుని అరిటాకు పరిచి నీళ్ళు జల్లి ఒకో గిన్నె విప్పి ముందు పెట్టేడు.


తినడం మొదలెట్టిన ముసలాయన నచ్చినవి తింటున్నాడు నచ్చనాటికేసి కన్నెత్తికూడా చూడ్డం లేదు.

కేరేజీ కాలవలో కడిగి పట్టుకుపోతున్న ఆ మనిషినాపి ''ఎవరతను?'' అనడిగాను.

''ఆయన తెల్దా?'' విస్తుపోతా అడిగేడు ముసలిమనిషి.

''మాదీవూరుగాదు'' అన్నాను.

''అలా చెప్పు ఈ ప్రాంతంలో కలిదిండి రాజు గారిని ఎరగని వాళ్ళు ఎవరూ లేరు'' అనేసెళ్ళిపోతుంటే ఆపి ఆరాజుగారి గురించి చెప్పమని అడిగేను.





కేరేజీ గట్టుమీద పెట్టిన ముసలోడు ''ఆయన కలిదిండి రాజుగారు. గొప్ప ఆస్తిపరులు. అయిదు వందల ఎకరాల పొలం వుండేది. సరాసరి పొలంలోకి కారు వెళ్ళడానికి సిమెంటు రోడ్డు వేయించాడు ఆరోజుల్లో'' అని చెప్పడం మొదలెట్టాడు.

* * *

రామమందిరం దగ్గర పోగడ్డ ఊళ్ళో జనం ఆ ఏడాది గణపతి నవరాత్రులు చాలా ఘనంగా చేద్దామనుకున్నారు. తొమ్మిదిరోజులూ తొమ్మిది రకరకాల ప్రోగాములు పెట్టి చివరిరోజున అన్న సంతర్పణ పెట్టి ఊరంతా సందడి సందడి చేసేద్దామనుకున్నారు. వాళ్ళనుకున్నట్టు జరగాలంటే చాలా డబ్బు కావాలి. అంత డబ్బు కావాలంటే ఏం చెయ్యాలి అనుకుంటుండగా కలిదిండిరాజుగారు గుర్తుకొచ్చేరు. ఆ

చల్దిపొద్దు వేళప్పుడు గుంపుగా ఆయనింటికెళ్ళి "ఈ చుట్టుపక్కల ఊళ్ళన్నీ మారు మోగిపోయేలాగ జరిపిద్దామను కుంటున్నావండి నవరాత్రుళ్ళు. మీరు దయచూపిస్తే తప్ప మేమేం చెయ్యలేం గదా?" అన్నారు.

"ముందెళ్ళి ఊరంతా చందాలు పోగు చేసుకొచ్చి ఎంత వసూలయిందో చెప్పండి. అప్పుడు నా చందా ఎంతో చెపుతాను" అన్నారు రాజుగారు.

వెనక్కొచ్చిన జనం బియ్యంనూక ఆడే మిల్లు ఓనరు బోళ్ళ వీరాస్వామి దగ్గరకీ, ఆరు లాంచీల యాజమాని అంగరసూర్రావు దగ్గరకీ, ఇటిక బట్టీల ఓనరు యర్రంశెట్టి సుబ్బారావు దగ్గరకీ, బ్రాంచి సైకిలు షాపులు నడిపే వాకాటి తిరపతిరావు దగ్గరకే గాకండా ఇంకా ఊళ్ళో ఉన్న రైతులందరి ఇళ్ళకీ కల తిరిగితే ఎనిమిదివేలు కంటే వసూలవ్వలేదు. అదిగాక అయిదూ పదీ, రూపాయి పాపాయి ఇలా వసూలైన ప్రతి పైసా కలిపితే పదివేలు దగ్గర దగ్గరకి చేరినియ్యి.

కలిదిండి రాజుగారి దగ్గరకెళ్ళి చెప్పేరు.

"ఎంత పోగడ్డాయన్నారు?" రాజుగారు.

"దగ్గర దగ్గర పదివేలండి".

"ఇదిగో నా చందా పదివేల ఒక్కరూపాయి... అయితే ఒక కండీషను. నేనిది ఇచ్చినట్టు ఎక్కడా చెప్పకూడదు. పొగడకూడదు. నవరాత్రి పందిరిమైకులో చదవకూడదు. పొరపాట్న ఎవరైనా ఆపని చేస్తే చాలా కోపం వస్తది నాకు" అన్నారు.

స్కూలు బిల్డింగ్ కడ్తున్నావండి. మీరింత చందా ఇస్తే మీ పేరు శిలాఫలకం మీద రాస్తామని వచ్చేడు పక్కూరు ప్రెసిడెంటు.

నవ్విన రాజుగారు "మీరడిగింది ఇస్తానుగానీ, పలకల మీద రాయడం, బలపంతో రాయడం లాంటివి చెయ్యొద్దు ఇది నా వార్నింగు" అన్నారు.

వరదలు వస్తే గాదుల్లో ధాన్యం బస్తాలు బయటికి తీయించేవాడు రాజుగారు. వాటిని దంపించి గాడిపొయ్యిలు తవ్వించి, వీధంతా బంతులేసి అందరికీ అన్నాలు పెట్టేవాడు.

ప్రతి ఏడూ వేసంగుల్లో మాలపల్లి తగలపడిపోయేది. కొమరిపాలెం నించి వచ్చిన వాస్తు సిద్ధాంతి చిట్టిబాబుగారు వాస్తుదోషం ఆగ్నేయమూల నీరుండకూడదు. చేపల చెరువూ మంచినీళ్ళ చెరువూ ఉన్నాయి ఆ దోషం వల్లే ఈ తగలపడిపోడం అన్నారు.

దాంతో,

చాలా డబ్బు ఖర్చు పెట్టి ఆ చెరువులు మూయించెయ్యడమే గాకండా, ఆ రెండుపేటల్లోనూ తాటాకు కొంపన్నది లేకండా జగ్గంపేటనించి బంగాళాపెంకు తెప్పించి అందరికీ పెంకుటిళ్ళు కట్టించేసేడు.

కలిదిండి రాజుగారి దగ్గర ఆశించి వచ్చినోడు ఒట్టి చేతుల్తో వెనక్కెప్పుడూ వెళ్ళలేదు. అలా దానాలూ ధర్మాలూ చేసుకుపోతూనే ఉండేవారు రాజుగారు అలాగ. కుడిచేత్తో చేసిన దానం ఎడం చేతికి తెలీనిచ్చేవారు కాదు...

డబ్బు అవసరపడ్డప్పుడల్లా కొంచెం కొంచెం పొలం అమ్ముకుంటూ పోతున్నాడు రాజుగారు. అంత ఆస్తి కొంచెం కొంచెంగా తరిగిపోతా ఉంది.

ఒకరోజున ఒక స్వాములవారు వాళ్ళ శిష్యుల్తో మా ఊళ్ళోకి దిగి రాజుగారి దివాణంలో మకాం పెట్టేరు. రెండురోజులు గడిచేకా ఊరి

చివర శిథిలమైనపోయి ఉన్న శివాలయం దగ్గరకెళ్ళి "దీన్ని పునరుద్ధరించాలి. లేకపోతే ఈ వూరికి కరువుకాటకం సంభవిస్తాయి" అన్నారు.

భయపడిపోయిన ఊళ్ళోజనం ఏం చేద్దావంటే ఏం చేద్దావనుకుని చివరికి రాజుగారు గుర్తుకొచ్చేరు.

"ఆ గుడి రాజుగారి పొలాల్ని జేర్చి ఉంది. పైగా దాన్ని కట్టించింది వాళ్ళ పూర్వీకులే అంటన్నారు గాబట్టి ఆయన దగ్గర కెళ్ళడమే సబబు" అన్నాడు బోళ్ళ వీరాస్వామి.

ఊరోళ్ళంతా గుంపుగా తయారయ్యి రాజుగారి దివాణం దగ్గరకొచ్చేసరికి కారు ఆగి ఉంది. ఎక్కడికో వెళ్ళడానికి లోపల తయారవుతున్నారు రాజుగారు.

కాస్సేపయ్యింది.

బయటికొచ్చిన రాజుగారు ఊకుమ్మడిగా వచ్చిన ఊరోళ్ళందర్నీ చూసి "ఏంటిలా దిగేరు?" అన్నారు.

విషయం అంతా చెప్పి "గుడిని మొత్తం బాగు చేయించి రేపొచ్చే శివరాత్రి నాటికి ఆ లింగాన్ని పునఃప్రతిష్ఠచెయ్యాలనుకుంటున్నాం" అన్నారు.

"శుభం" అని నవ్వేరు రాజుగారు.

"దేవుడికి మీరేవన్నా పొలం రాస్తే పర్మనెంటుగా ఇద్దరు పూజారుల కుటుంబాల్ని తీసుకొద్దాం. ఉత్సవాలూ అయ్యి ఘనంగా చేయిద్దావనుకుంటున్నాం" అన్నారు.

"స్వాములవారు నాకు కబురు చేసి అంతా చెప్పారు. ఒక ఏభై ఎకరాలు దేవుడి పేర్న రాద్దామని చాన్నాళ్ళనించి అనుకుంటున్నాను. ఆ పని ఇప్పుడు చేస్తాను" అన్నారు రాజుగారు.

అంతా ఆయన కాళ్ళమీద పడిపోయేరు.

రాజుగారి దగ్గరకొచ్చిన అంగరసూర్రావు "గుడికి ధర్మకర్తగా మీరే వుండాలి" అన్నాడు.

పెద్దగా నవ్వేసిన కలిదిండిరాజుగారు "దేవుడిమీద పెత్తనం చెలాయించడానికి నేనెవర్ని చెప్పండి... వెళ్ళండి శివరాత్రి దగ్గర పడ్తుంది వెంటనే వెళ్ళి గుడి రిపేరు పన్లు చూడండి" అని వాళ్ళని పంపేసి కారెక్కి వెళ్లిపోయేరు.

రాజుగారికి రాజోలు అవతల మానేపల్లిలో ఒకావిడ ఉండేది. వారానికి రెండుమూడు సార్లు వెళ్ళి వస్తుండేవారు. ఆవిడ దగ్గరకి.

ఒకరోజున రాజుగారు మాంచికళలో ఉన్నప్పుడు "ఇన్నాళ్ళనించీ నాకు డబ్బుగా, బంగారంగా ఇస్తా వస్తున్నారు తమరు. భూమిగా ఏవన్నా రాయండి" అందావిడ.

వెంటనే పాతికెకరాలు రాస్తానని మాటిచ్చేరు రాజుగారు.

అది తెల్సిన రాజుగారి పెద్దకొడుకు పర్వతాల్రాజు ఎదురు తిరిగేడు. "మీరిలాగ దానధర్మాలు చేసుకుంటా పోతుంటే మేం అడుక్కు తినమా?" అన్నాడు.

లోపల్నుంచొచ్చిన రాజుగారి భార్య "మీకు పుట్టిన పాపానికి నా పిల్లలు రోడ్డుమీద పడకండా చూడండి. అందరికీ దానాలు చేస్తున్నారు కదా? వీళ్ళకి కూడా ఏవన్నా రాసి దానం చేసేను అనుకుని ఆస్తి రాయండి. మీకెంత దానం చెయ్యాలనిపిస్తే అంతే చెయ్యండి మేమేం

అనుకోం'' అని కళ్ళనీళ్ళు పెట్టేసుకుంది.

''ఇంట్లోవాళ్ళకి ఆస్తి గురించి తనని అడిగే హక్కులేదు. ఎందుకంటే అది తన రెక్కల కష్టంతో సంపాయించుకున్న ఆస్తి. అలాగని వాళ్ళతో ఎలాంటివాదనా పెట్టుకోకుండా, ఏవిధమైన గొడవా పడకుండా భార్యతో సహా కొడుకులకి, కూతుళ్ళకు అందరికీ తలో పాతికెకరాల చొప్పున రాసేసి, దివాణంకూడా వాళ్ళకే ఇచ్చేసి ఆవూర్నే శాశ్వతంగా వదిలిపెట్టి ఈ ఎర్రపోతవరం వచ్చేసారు రాజుగారు. ఆస్తి ఆరతి కర్పూరంలా అయిపోయింది. చివరికి ఈవూరి లాకుల దగ్గర చింతచెట్టే ఇల్లయింది మా కలిదిండిరాజుగారుగారికి'' అని చెప్పాడు ముసలోడు.

ముసలోడు చెప్పినకథ వింటే చాలా బాధనిపించింది నాకు. ఆ తర్వాత ఆరూట్లో ఎప్పుడు వెళ్ళినా రాజుగారికి దణ్ణం పెట్టుకుని వెళ్ళేవాడ్ని.

ఒకరోజు రాత్రి చిరిగిపోయిన రగ్గు కప్పుకుని చెట్టుకింద పడుకున్న రాజుగారు నిద్దట్లోనే చనిపోయారు. వూరు వూరంతా కదిలి వచ్చింది ఆయన్ని చూడ్డానికి. ఏ చింతచెట్టు కిందయితే చనిపోయారో, ఆ చింతచెట్టు కిందే సమాధి చేసారు రాజుగారిని.

* * *

చాలా ఏళ్ళు గడిచిపోయినియ్యి.

సరిగ్గా చూసేవాళ్ళు లేక రాజుగారి సమాధి మీద పగుళ్ళు తీసినియ్యి. సమాధి చుట్టూరా, పగిలిన బీటల్లోంచి జలగడ్డి మొలిచింది.

ఆ మొండిమీద పశువుల్ని మేపుతున్న పాలికాపుకుర్రోళ్ళు కాలవలోకి దూకి ఈతలు కొడ్తున్నారు. మేస్తున్న పశువుల్నుంచి విడిపోయి దూరంగా వచ్చిన ఒక ఆవు కలిదిండిరాజుగారి సమాధి దగ్గరకొచ్చి చుట్టూ బీటల మధ్యా మొలిచిన జలగడ్డిని మేస్తుంటే లేగదూడ ఆవు పొదుగుని గుద్దిగుద్ది మరీ తాగుతుంది పాలు.

సైకిలు మీద ఆ దార్లో వెళ్తూ ఆ దృశ్యాన్ని చూసి స్వర్గంలో దానాలు చేస్తున్న కలిదిండిరాజుగారికి చివరిసారిగా నమస్కారం చేసుకున్నాను.

* * *